సాక్షి
సిద్దిపేట
శనివారం । 14 । అక్టోబర్ । 2023



పట్టుబిగిస్తున్న బీజేపీ
పటాన్‌చెరు నియోజకవర్గంలో బీజేపీ బలం క్రమంగా పెరుగుతోంది. అధికార పార్టీ బీఆర్‌ఎస్ బలంపై ప్రభావం చూపుతోంది.

వివరాలు IIలో ▸

బతుకమ్మలతో విద్యార్థినులు



న్యూస్‌రీల్

ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ : మంత్రి హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమే బతుకమ్మ పండుగ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆడపడుచులకు మంత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో తయారుచేసిన బతుకమ్మలతో ఆడపడుచులు జరుపుకొనే పండుగ అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఔనత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ వేడుకలన్నారు.

విద్యార్థులను ఉన్నతిగా తీర్చిదిద్దండి

టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి



ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న టీపీటీఎఫ్ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన 25 మందికి టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు దిశానిర్దేశం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి సయ్యద్ సౌకత్ అలీ, మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుదాస్, నర్సింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కనకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది మోసపూరిత పాలన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ ఇదిగో అదిగో అంటూ ఆశ చూపి మోసపూరిత పాలన సాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని సలెంద్రి గ్రామంలో 50 మంది యువకులు శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు, వృత్తుల వారీగా పథకాలను వర్తింపజేస్తామంటూ మోసం చేస్తున్నారన్నారు. అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరశురాములు, నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో భారీగా నగదు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు రూ.1.30లక్షలు పట్టుకున్నారు. ఎస్‌ఐ వివేక్, సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో జనగామ జిల్లా నర్మెట్ట మండలం తరిగొప్పులకు చెందిన రజనీకాంత్ డబ్బులు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న డబ్బులకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేలకు పైగా డబ్బులు ఉంటే కచ్చితంగా ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. లేకపోతే సీజ్ చేస్తామన్నారు.

అయినాపూర్ శివారులో...

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ శివారులో పోలీసులు రూ.లక్షా17వేల నగదు సీజ్ చేశారు. వాహనాల తనిఖీ చేస్తుండగా మర్యాక్ మండలంలోని చేబర్తి గ్రామానికి చంద్రశేఖర్ కారులో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

మద్దూరులో ..

మద్దూరు(హుస్నాబాద్): మండలం పరిధి లద్నూరులోని చెక్‌పోస్టు వద్ద రూ.93,400 సీఐ సత్యనారాయణరెడ్డి పట్టుకున్నారు.

పూల పండుగకు వేళాయె..

నేటి నుంచి బతుకమ్మ వేడుకలు

సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే బతుకమ్మ పండుగను శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించేందుకు జిల్లాలోని ప్రజలు సిద్ధమయ్యారు. ప్రకృతిని దేవతగా ఆరాధిస్తూ.. తీరొక్క పూల పండుగను ఘనంగా చేపట్టేందుకు ఆడపడుచులు తమ పుట్టింటికి వచ్చేశారు. అక్కాచెల్లెళ్లు.. తోటి మహిళలతో కలిసి ఆడిపాడుతారు. పండుగ సందర్భంగా మార్కెట్లలో పూల విక్రయాలు జోరందుకున్నాయి. వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి.

– ప్రశాంత్ నగర్ (సిద్దిపేట)



కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు


సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి బతుకమ్మల వద్ద ఆడిపాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఈ పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ క్లబ్ విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, జబర్దస్త్ ఆర్టిస్ట్ కుమారి విశ్వప్రార్థిని, వైస్ ప్రిన్సిపాల్ వాసం శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

– సిద్దిపేట ఎడ్యుకేషన్



బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

ఉద్యమ గడ్డ... సెంటిమెంట్ అడ్డా



గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించిన సీఎం కేసీఆర్ (ఫైల్)

కేసీఆర్‌కు కలిసొచ్చిన హుస్నాబాద్
- మూడోసారి ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం
- ఈ ప్రాంత ప్రజల 'ఆశీర్వాదం'.. గులాబీ బాస్‌కు మనోబలం

హుస్నాబాద్: సీఎం కేసీఆర్‌కు హుస్నాబాద్‌తో విడదీయలేని అనుబంధం.. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు హుస్నాబాద్‌పై పూర్తి విశ్వాసం.. మంత్రిగా, ముఖ్యమంత్రిగా హుస్నాబాద్‌లో పర్యటించి ఇక్కడి ప్రజల మన్ననలు పొందారు. దశాబ్దకాలం నాటి గౌరవెల్లి ప్రాజెక్టు కలను నిజం చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్ హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ప్రారంభ కార్యక్రమానికి వచ్చారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టారు. సిద్దిపేట నుంచి సైకిల్ యాత్ర చేపట్టిన కేసీఆర్ హుస్నాబాద్‌లో కొంత సమయం కేటాయించి ఇక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం హోదాలో హుస్నాబాద్ పట్టణంలో మొదటి సారిగా హరిత హారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు నెలల్లోనే మళ్లీ హుస్నాబాద్ పట్టణంలో పర్యటించిన సీఎం కేసీఆర్ 1.14 టీఎంసీల సామర్థ్యం ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టును 8.23టీఎంసీలకు, 0.14 టీఎంసీల సామర్థ్యం ఉన్న గండిపెల్లి ప్రాజెక్టు 1.15 టీఎంసీలకు పెంచి హుస్నాబాద్‌పై తనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా ఉమ్మాపూర్‌లో ఉన్న మహాసముద్రం గండి రిజర్వాయర్‌ను స్వయంగా పరిశీలించారు. ఇక్కడే ప్రజలతో భోజనం చేసి, నిర్మాణం కోసం రూ.3కోట్లు మంజూరు చేశారు. నేడు ఈ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది.

ఏ పనిచేపట్టినా..

సీఎం కేసీఆర్ సెంటిమెంట్, వాస్తును బాగా నమ్ముతారు. ఏ పని చేపట్టినా సెంటిమెంట్‌తో ముందుకు సాగుతూ విజయాన్ని అందుకుంటున్నారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని సీఎం ఇక్కడే పూరించారు. 2018లో అసెంబ్లీ రద్దు తర్వాత పార్టీ అభ్యర్థులను ప్రకటించిన తెల్లవారు జామునే హుస్నాబాద్‌లో ఆశీర్వాద సభ పేరుతో ఎన్నికల సంగ్రామంలోకి వెళ్లారు. సెప్టెంబర్ 7న శ్రావణ మాసం శుక్రవారం రోజు తొలి ఎన్నికల సభను హుస్నాబాద్ నుంచే ప్రారంభించారు. గడిచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చింది. అదే సెంటిమెంట్‌తో మళ్లీ మూడో సారి ఈ నెల 15న హుస్నాబాద్‌లో ఎన్నికల శంఖారావానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2014, 2018 ఎన్నికల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ విజయం సాధించారు. హైదరాబాద్‌కు ఈశాన్యం వైపున ఉన్న హుస్నాబాద్‌లో సభ నిర్వహిస్తే అంతా విజయమే వరిస్తుందనే విశ్వాసంతో ఆశీర్వాద సభ అనే నామకరణానికి శ్రీకారం చుట్టినట్లు ప్రచారం.

హస్తంలో మారుతున్న సీన్!

- కాంగ్రెస్‌కు పొన్నాల రాజీనామా
- బీఆర్‌ఎస్‌లో చేరే అవకాశం
- ప్రతాప్‌రెడ్డికి లైన్ క్లియర్?
- జనగామలో ఆసక్తికర రాజకీయాలు



ప్రతాప్‌రెడ్డి



సాక్షి, సిద్దిపేట: ఎన్నికల సమయంలో జిల్లాలో రాజకీయాలు మారుతున్నాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మాజీ మంత్రి, పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్ పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. నాలుగు మార్లు జనగామ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 12 ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ శాఖలకు మంత్రిగా కొనసాగారు. బీఆర్‌ఎస్‌లో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

ప్రతాప్‌రెడ్డి కేనా?

జనగామ నియోజకవర్గంలో మొదటి నుంచి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిలు కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. పొన్నాల రాజీనామా చేయడంతో ప్రతాప్ రెడ్డికే టికెట్ లభించే అవకాశాలున్నాయి. 2004, 2008లో టీఆర్‌ఎస్ తరఫున చేర్యాల ఎమ్మెల్యేగా ప్రతాప్ రెడ్డి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో జనగామ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. జిల్లాలో గజ్వేల్ నుంచి నర్సారెడ్డి, జనగామ నుంచి ప్రతాప్ రెడ్డిల టికెట్‌లు దాదాపు ఖరారయ్యాయి. సిద్దిపేట నినయోజకవర్గం నుంచి భవానీరెడ్డికి టికెట్ లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంకా హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో ఉంటారో అని ఉత్కంఠ కొనసాగుతోంది. హుస్నాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, దుబ్బాక నుంచి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ కుమారెడ్డి, కత్తి కార్తీకలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

పీసీసీ మైనారిటీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా అతార్



నియామక పత్రం అందుకుంటున్న అతార్ అహ్మద్

చేర్యాల(సిద్దిపేట): పీసీసీ మైనారిటీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన అతార్ అహ్మద్‌ను నియమించినట్లు మైనారిటీ సెల్ రాష్ట్ర చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహెల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతార్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్‌లో వివిధ స్థాయిల్లో పనిచేసిన తనకు రాష్ట్ర కన్వీనర్‌గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తూ మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'డబ్బులతో ఆత్మగౌరవం కొనలేరు'

పాపన్నపేట(మెదక్): కొందరు డబ్బుల సంచులతో ఓట్ల కోసం వస్తున్నారని, కానీ మెదక్ ప్రజల ఆత్మగౌరవాన్ని మాత్రం వారు కొనలేరని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ మెదక్‌లో పద్మమ్మ గెలిచి హ్యాట్రిక్ సాధించడం తథ్యమన్నారు. దండగా అన్న వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న వినూత్న పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరువులు, కర్ఫ్యూలు సాధారణమన్నారు. కాళేశ్వరం నీళ్ళు వస్తే ఘనపురం నీటికి కొదవ ఉండదన్నారు. శశిధర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాతికేళ్లుగా కాంగ్రెస్‌కు సేవ చేస్తున్నా పార్టీలో తనకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కష్టపడిన వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి టిక్కెట్లు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ నైజమన్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

మాజీ ఎమ్మెల్యే చాడ వాహనం తనిఖీ...

హుస్నాబాద్‌రూరల్: సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి వాహనాన్ని శుక్రవారం జిల్లెలగడ్డ చెక్ పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ రావడంతో జిల్లాల సరిహద్దు వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కాంగ్రెస్, వామపక్షాల పొత్తులో భాగంగా సీపీఐ హుస్నాబాద్ సీటును కోరుతోంది. సీపీఐకి వస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా చాడ పోటీలో ఉండనున్నారు. ఈ క్రమంలో ఊరూరా విస్తృతంగా పర్యటిస్తున్నారు. చాడ వెంకటరెడ్డి వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించి పంపించారు.



చాడ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

పల్లా సభలో ప్రొటోకాల్ రగడ



సభలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం

ముత్తిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి వర్గీయుల మధ్య గొడవ

మద్దూరు(హుస్నాబాద్): ముత్తిరెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి వర్గీయుల మధ్య వర్గ విభేదాలు మళ్లీ భగ్గుమన్నాయి. శుక్రవారం మద్దూరులో జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రొటోకాల్ ప్రకారం వేదిక పైకి పిలవకపోవడంతో పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్‌కు, ఎంపీటీసీ సమ్మయ్యకు మధ్య గొడవకు దారి తీసింది. కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో అక్కడే ఉన్న పార్టీ పెద్దలు గొడవను సద్దుమణిగేలా చూశారు. అనంతరం పల్లా ఇరువర్గాలతో మాట్లాడుతూ విభేదాలు వీడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

నేను జనగామ ప్రాంత బిడ్డనే..

తాను స్థానికేతరుడిని కాదని జనగామ ప్రాంత బిడ్డనేనని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు, దూళ్మిట్ట మండలకేంద్రాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఈనెల 16న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మద్దూరు మండల అభివృద్ధికి అనేక నిధులు మంజూరు చేశానని.. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, నాయకులు మంద యాదగిరి, ఆరీఫ్, జల్లి సిద్దయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- గజ్వేల్ ఐఓసీ సందర్శన
- ఎన్నికల విభాగాల పరిశీలన



సిద్దిపేట అర్బన్: ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ తదితరులు

గజ్వేల్: శాసన సభ ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆదేశించారు. శుక్రవారం గజ్వేల్ ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)ను సందర్శించి పోలింగ్ స్టేషన్లు, ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు సంబంధించి సూచనలు చేశారు. ఐఓసీలోని ఏ–బ్లాక్‌లో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కిటికీలను పూర్తిగా ఇటుకలతో మూసివేయాలన్నారు. ముందుభాగంలో సీసీ కెమెరాలు బిగించాలన్నారు. ఫైరింజన్ 24గంటలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పోస్టాఫీస్‌లో ఓటర్ ఐడీ కార్డుల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎలక్షన్ మెటీరియల్ రూమ్, ఈవీఎం హాల్, ఈవీఎం కమిషన్ హాల్, ఎన్నికల ఖర్చు మానిటరింగ్ సెల్, అకౌంటింగ్ టీమ్, మానిటరింగ్ అబ్జర్వర్, తదితర గదులను పరిశీలించారు. ఆ తర్వాత ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ స్టేషన్‌కు ప్రహరీ లేనందున భారీకేడింగ్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఇంకా గజ్వేల్ ఆర్‌డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్, ఏసీపీ రమేశ్, తహసీల్దార్ బాల్‌రాజు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

సిద్దిపేటఅర్బన్: కౌంటింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులకు సూచించారు. ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను సీపీ శ్వేతతో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల సంబంధించి స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపునకు సబంధించి ఆయా బ్లాక్‌లలో గదులను సిద్ధం చేయాలని మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అన్ని బ్లాక్‌ల ఆవరణ చుట్టూ సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని అర్బన్ తహసీల్దార్‌కు సూచించారు. కలెక్టర్ వెంట దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, ఈఆర్వోలు, గరీమా అగర్వాల్, రమేష్ బాబు, బన్సీలాల్, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బీపీ చెకప్ యంత్రం

సిద్దిపేటరూరల్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో కలెక్టరేట్‌లో సెల్ఫ్ ఆటోమేటిక్ బీపీ చెకప్ యంత్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కాశీనాథ్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



బీపీ చెకప్ చేసుకుంటున్న కలెక్టర్

సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



మహిళలకు అండగా..

బాలికలు, మహిళలకు అండగా పీటీమ్స్ పనిచేస్తున్నాయని సీపీ శ్వేత తెలిపారు.

వివరాలు 10లో ▸



బతుకే ఉత్సవం..

బతుకమ్మ సంబురాలు ఈ నెల 14 నుంచి 22 వరకు వేడుకలు జరుగుతాయి.

వివరాలు 10లో ▸

నేటి నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల-కళాశాలలో ఈ నెల 13 నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు మెదక్ ఈస్ట్ రీజియన్ కో ఆర్డినేటర్ నిర్మల తెలిపారు. 9వ జోనల్ మీట్‌లో భాగంగా సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందిన 12 గురుకులాల్లోని 1,020 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

న్యూస్‌రీల్

మల్లన్న హుండీ ఆదాయం రూ.65.18లక్షలు



ఆలయంలో నగదు లెక్కిస్తున్న సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఖజానాకు భారీ ఆదాయం సమకూరింది. 62 రోజులలో హుండీ ద్వారా రూ.65,18,785 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఆలయంలోని హుండీలను మెదక్ జిల్లా దేవాదాయశాఖ పరిశీలకుడు రంగారావు, ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ సేవాసమితి సభ్యులు హుండీ లెక్కించారు. నగదు రూ.65,18,785, విదేశి కరెన్సీ నోట్లు 11, మిశ్రమ బంగారం 25గ్రాములు, మిశ్రమ వెండి 4కిలోల 500 గ్రాములు, పసుపు బియ్యం10 క్వింటాళ్ల వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి మాట్లాడుతూ హుండీల ద్వారా వచ్చిన నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు తెలిపారు.

దుబ్బాకలో మళ్లీ బీజేపీదే గెలుపు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గంలో మరోమారు పాగా వేస్తామని స్థానిక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. రాయపోలు మండలం టెంకంపేట, కొత్తపల్లి, రామారం, చిన్నమాసాన్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కండువాలతో ఆహ్వానించిన రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ఉద్యమాల గడ్డ దుబ్బాకలో ఉప ఎన్నికల్లో సాధించిన విజయం స్ఫూర్తితో మరోమారు జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేస్తున్నారని, ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి, నాయకులు రాజిరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, నీల స్వామి, కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక బస్సులు

సిద్దిపేటకమాన్: బతుకమ్మ, దసరా పండగను పురస్కరించుకుని శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు పండుగ సెలవులు ఇచ్చినందున హైదరాబాద్ నుంచి వారి స్వస్థలాలకు వచ్చే వారి సౌకర్యార్థం అదనపు బస్సు సేవలు నడుపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 21నుంచి 23వరకు తిరిగి 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ఐదుగురు ప్రయాణికులను (మహిళలు, పురుషులు వేర్వేరుగా) లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి రూ.9,900 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం సూచించారు.

పట్టు రైతులను ఆదుకోండి



జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పట్టు రైతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా పట్టు రైతుల సంఘం నాయకులు కోరారు. గురువారం ఈ మేరకు నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటీవ్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టుగూళ్లు అమ్మిన రోజే రైతులకు డబ్బులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల ఐలయ్య, ఉపాధ్యక్షుడు యాదగిరి, సహాయ కార్యదర్శి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పూల సింగిడి.. ముందస్తు సందడి

- పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు
- ఆడిపాడిన కలెక్టర్ దంపతులు

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలల్లో గురువారం ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలు తయారు చేసి చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ ఆడిపాడారు. అనంతరం సమీపంలోని జలాశయాల్లో నిమజ్జనం చేశారు. సిద్దిపేట పట్టణంలోని మెరిడియన్ పాఠశాలలో జరిగిన సంబరాల్లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ దంపతులు పాల్గొని సందడి చేశారు. రావణ బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించే పండుగ సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. – సిద్దిపేట జోన్



హుస్నాబాద్ పట్టణంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు, చిన్నారులు



సిద్దిపేటలో విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ దంపతులు



సిద్దిపేటలోని పాఠశాలలో బతుకమ్మ సందడి

సెంటిమెంట్‌తో శ్రీకారం

బీఆర్ఎస్.. ఎన్నికల ప్రచారాన్ని హుస్నాబాద్ నుంచి శ్రీకారం చుడుతోంది. నగరానికి ఈశాన్యంలో హుస్నాబాద్ ఉండటం.. ఇది సీఎం కేసీఆర్ సెంటిమెంట్‌గా భావిస్తుండటంతో తొలి ఆశీర్వాద సభను ఇక్కడే నిర్వహిస్తున్నారు. గత రెండు మార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఈసారి హ్యాట్రిక్ కొట్టాలన్న ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం హుస్నాబాద్‌లో సుమారు లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

– సాక్షి, సిద్దిపేట

15న హుస్నాబాద్‌లో 'తొలి ఆశీర్వాదం'

- సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ఏర్పాట్లు
- భారీ జనసమీకరణకు కసరత్తు
- ఇప్పటికే దిశానిర్దేశం చేసిన మంత్రి హరీశ్‌రావు



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

బీఆర్ఎస్ అధినేత హుస్నాబాద్‌ను సెంటిమెంట్‌గా భావిస్తున్నారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడి నుంచే శంఖారావం పూరించి అధికారంలోకి వచ్చారు. ఈసారి కూడా హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో పార్టీ అభ్యర్థులతో సమావేశమై పలు సూచనలు చేసి, బీ ఫారాలు అందజేసి, ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం హుస్నాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. పట్టణంలోని సబ్ స్టేషన్ సమీపంలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో సభను ఏర్పాటు చేస్తున్నారు. సభా స్థలం దగ్గరే హెలిప్యాడ్‌ను నిర్మిస్తున్నారు. ఈ నెల 10న సభాస్థలి మంత్రి హరీశ్ రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌లు పరిశీలించారు. అనంతరం కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే సతీష్ కుమార్ దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

భారీ జనసమీకరణ

హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల్లో విస్తరించి ఉంది. సిద్దిపేట జిల్లా పరిధిలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలు, హన్మకొండ జిల్లాలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, సైదాపూర్‌లు ఉన్నాయి. ఆయా మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. చిగురుమామిడికి రామకృష్ణారావు, సైదాపూర్‌కు అనిల్, ఎల్కతుర్తికి వెంకన్న, కోహెడకు రాధాకృష్ణ శర్మ, భీమదేవరపల్లి శోభన్, అక్కన్నపేట సోమిరెడ్డి, హుస్నాబాద్ రూరల్ సంపత్ రెడ్డి, హుస్నాబాద్ పట్టణం మచ్చ వేణుగోపాల్ రెడ్డిలను ఇన్‌ఛార్జులుగా నియమించారు. ఇప్పటికే ఆయా మండల స్థాయిలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఐదు గ్రామాలకు ఒక ఇన్‌చార్జి చొప్పున నియమించారు. మండల స్థాయిలో మండల అధ్యక్షకార్యదర్శులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు పర్యవేక్షిస్తున్నారు. హుస్నాబాద్ నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డప్పుల చప్పుళ్లు, బతుకమ్మలు, బోనాలు, పీర్లతో భారీ ర్యాలీగా సభా స్థలానికి చేరుకునే విధంగా వార్డుల వారీగా ప్రణాళికలను రూపొందించారు.

న్యాయం చేయండి



కలెక్టరేట్‌లో ఏఓ రెహమాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొడకండ్ల గ్రామస్తులు

అనర్హులకే డబుల్ బెడ్రూంలు

- బంధువులకే ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు
- కలెక్టరేట్‌లో కొడకండ్ల వాసుల ఫిర్యాదు

గజ్వేల్‌రూరల్: డబుల్ బెడ్రూం ఇళ్ల ఎంపికలో అవకతవకలకు పాల్పడుతూ అర్హులైన తమకు కేటాయించకుండా అధికార పార్టీ నాయకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని బాధిత లబ్ధిదారులు ఆరోపించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన పలువురు గురువారం కలెక్టర్ కార్యాలయ ఏఓ రెహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొడకండ్లలో 56 డబుల్ బెడ్రూంలు మంజూరు కాగా... మొదట విడత ప్రకటించిన జాబితాలో తమ పేర్లు వచ్చాయన్నారు. అయితే తుది జాబితాలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ అరిగె అశోక్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొడిత్యాల భాస్కర్ తదితరులు కలిసి మా పేర్లను తొలగించారన్నారు. రాజకీయ ప్రమేయంతో వారి బంధుమిత్రులకు కేటాయించుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం కేటాయించిన వారికి విలువైన భూములు, ఆస్తులు ఉన్నాయని అన్నారు. అంతేకాకుండా ఇతర సంక్షేమ పథకాలు సైతం పొందారని ఆరోపించారు. ఇదే విషయాన్ని ఎంపీటీసీ అశోక్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భాస్కర్‌ను నిలదీయగా... మా ఇష్టమున్న వారికి ఇచ్చుకుంటామని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 20 ఇళ్లను డబ్బుల రూపంలో అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయమై స్పందించి డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపికపై పూర్తి విచారణ జరిపించాలని, అర్హులైన వారికి వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో కళ్యాణి, రాధిక యాదమ్మ ఉన్నారు.

నిన్న కాషాయం కండువా.. నేడు గులాబీ కండువా

- గంటల వ్యవధిలోనే పార్టీలు మారిన నేత
- మిరుదొడ్డిలో ఆసక్తికర చర్చ

మిరుదొడ్డి(దుబ్బాక): ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన మిరుదొడ్డి ఉప సర్పంచ్ కనకయ్య గంటల వ్యవధిలోనే సొంత గూటికి చేరుకున్న వైనం చర్చనీయాంశంగా మారింది. ఉప సర్పంచ్ కనకయ్య తో పాటు మరో నలుగురు వార్డు సభ్యులు దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు సమక్షంలో బుధవారం సాయంత్రం బీజేపీలో చేరారు. ఇంతలో ఏమైందో ఏమో తెలియదు కానీ, తీరా చూస్తే గురువారం ఉదయం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎదుట కనకయ్య సొంత గూటికి చేరుకున్నాడు. కనకయ్యకు బీఆర్ఎస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంటల వ్యవధిలోనే ఉప సర్పంచ్ పార్టీలు మారడంతో మండల పరిధిలో జోరుగా చర్చ సాగింది.



ఉప సర్పంచ్ కనకయ్యను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

ఆడపిల్లలను ప్రోత్సహిద్దాం

జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ వాసవి

సిద్దిపేటఅర్బన్: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రతి ఒక్కరూ పోత్సహించాలని, సమాజంలో ఎదురయ్యే ప్రతి సమస్యని ఎదుర్కొనే విధంగా ఆడ పిల్లలు తయారవ్వాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ వాసవి అన్నారు. అర్బన్ మండలం నాంచారుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం ప్రాముఖ్యత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల పుడితే ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుందని అన్నారు. లింగ వివక్ష చూపవద్దని, అన్ని రంగాల్లో ఎదిగేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. మహిళా సాధికారత కేంద్రం తరఫున బేబీ కిట్, చీర, స్వీట్స్ అందజేసి బాలింతలకు ఆడపిల్లల ప్రత్యేకత గురించి వివరించారు. అనంతరం పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, జెండర్ స్పెషలిస్టులు లావణ్య, పద్మ, ఫైనాన్షియల్ లిటరసీ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, దేవరాజు, స్రవంతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సాధించే వరకు ఉద్యమిస్తాం



దీక్షలో కూర్చున్న సీపీఎం నాయకులు

- జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్
- ఎన్నికల కోడ్‌తో దీక్షలు వాయిదా

చేర్యాల(సిద్దిపేట): రెవెన్యూ డివిజన్ సాధించేవరకు ఉద్యమిస్తామని, ఎన్నికల కోడ్ కారణంగా దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని సాధన జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద చేపట్టిన దీక్షలు గురువారానికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో సీపీఎం జిల్లా, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ముఖ్య నాయకులు కూర్చున్నారు. దీక్షలను ప్రారంభించిన జేఏసీ చైర్మన్ పరమేశ్వర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ చేర్యాలను డివిజన్ చేయాలంటూ కొనసాగిన దీక్షలకు అన్ని వర్గాల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. కానీ అధికార బీఆర్ఎస్ నాయకులు ఏమాత్రం స్పందించడంలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలిపారు. ఉద్యమంలో కలిసి వస్తున్న వారందరికీ ఉద్యమాభివందనాలు తెలిపారు. దీక్షలో సీపీఎం నాయకులు శశిధర్, సత్తిరెడ్డి, వెంకట్‌మావో, అరుణ్‌కుమార్, కృష్ణారెడ్డి, రవి, భాస్కర్, ప్రశాంత్, రవీందర్, నాగరాజు, శ్రీహరి, నర్సిరెడ్డి, మల్లేశం, శోభ, నూర్ బీ, రంజిత్‌రెడ్డి, చందు, బాలకిషన్, కనకయ్య, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, కరీం, మల్లేశం, సాయిలు, కృపాకర్, చంద్రం కూర్చోగా జేఏసీ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

సీసీఐ కేంద్రాలకు మార్గం సుగమం

ఉమ్మడి మెదక్ జిల్లాలో 43 జిన్నింగ్ మిల్లులు నోటిఫై

- 4.86లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- 35లక్షల క్వింటాళ్లకుపైగా దిగుబడులు వచ్చే అవకాశం
- కొనుగోళ్లు సక్రమంగా జరిగితేనే రైతులకు మేలు

గజ్వేల్: రెండేళ్లుగా సక్రమంగా సాగని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వ్యవహారం ఈసారి కొలిక్కి వచ్చింది. సీసీఐ టెండర్లలో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ లెక్కన ఉమ్మడి మెదక్ జిల్లాలోని 43 జిన్నింగ్ మిల్లులు సీసీఐ కేంద్రాలుగా మారనున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈసారి పత్తి 4.86లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చింది. ఇందులో సంగారెడ్డిలో అత్యధికంగా 3.45లక్షల ఎకరాలు, సిద్దిపేటలో 1.08 లక్షల ఎకరాలు, మెదక్‌లో 33వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతోంది. గతంతో పోలిస్తే ఈసారి అతివృష్టి, అనావృష్టితో కూడిన భిన్నమైన వాతావరణం ఉండటంతో పత్తి పంటకు కొంత నష్టం జరిగింది. ఈ క్రమంలో 35లక్షల క్వింటాళ్లకుపైగా దిగుబడులు రావచ్చని మార్కెటింగ్‌శాఖ అంచనావేస్తోంది.



గజ్వేల్‌లోని ఓ మిల్లులో పత్తి కొనుగోలు (ఫైల్)

మద్దతు ధర

గతేడాది పత్తికి మద్దతు ధర రూ.6,380ఉండగా ఈసారి రూ.6,620–7,020 పెంచారు. పింజి పెద్ద పత్తికి గరిష్ఠంగా, మధ్యస్తంగా పత్తికి కనిష్ఠంగా ధర చెల్లిస్తారు. సీసీఐ కొనుగోళ్లకు సర్వసన్నద్ధంగా ఉండాలనే సంకల్పంతో జిన్నింగ్ మిల్లుల నోటిఫైని త్వరగా పూర్తి చేసినట్లు తెలుస్తోంది. సంగారెడ్డిలో 20, సిద్దిపేటలో 21, మెదక్‌లో 2 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేశారు. కొన్నేళ్లుగా వీటినే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలుగా నోటీఫై చేస్తున్నారు. రైతుల వద్ద సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు క్వింటాలుకు సీసీఐ ప్రమాణాల ప్రకారం సుమారు 34కిలోలకుపైగా దూదిని, మరో 65కిలోల వరకు గింజలను వేరు చేసి ఇస్తారు. మిగితాది ప్రాసెస్ కింద పరిగణిస్తారు. అంతేకాకుండా దూదిని బేళ్లుగా (ఒక బేలు 165–175కిలోల వరకు ఉంటుంది) తయారుచేసి ఇచ్చినందుకు సీసీఐ ఒక బేలుకు రూ.1100కుపైగా జిన్నింగ్ ఛార్జి పేరిట మిల్లుల యాజమాన్యాలకు ఇస్తుంది. ఈ అంశంలో జిన్నింగ్ మిల్లులకు, సీసీఐకి మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో నోటిఫై ప్రక్రియ పూర్తయ్యింది. సంగారెడ్డి, మెదక్ జిల్లాలో ఇప్పటికే కేంద్రాల నోటిఫై పూర్తి కాగా, సిద్దిపేటలో ఆమోదమే తరువాయిగా ఉంది.

కమర్షియల్ పర్చేజ్ జరిగితేనే మేలు

ప్రభుత్వ మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో పత్తికి అధిక ధర పలికితే... సీసీఐ కేంద్రాలు అవసరం ఏమంటుందని అధికారులు వాదిస్తుంటారు. గతంలో సీసీఐ మద్దతు ధరతో ప్రమేయం లేకుండా ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులతో పోటీపడుతూ 'కమర్షియల్ పర్చేజ్' చేపట్టింది. ఈసారి కూడా అలా చేస్తే... రైతులకు పూర్తిగా ప్రైవేటు వ్యాపారులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉండదు. కానీ సీసీఐ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. సీసీఐ కేంద్రాల అంశంపై సంగారెడ్డి, మెదక్ జిల్లాల మార్కెటింగ్ అధికారి రియాజ్ మాట్లాడుతూ సీసీఐ కేంద్రాల నోటిఫై అంశాన్ని ధ్రువీకరించారు. కేంద్రాల్లో కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ లక్ష్యమన్నారు.

క్లుప్తంగా

కాటేసిన కరెంట్ తీగ

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టేక్మాల్ (మెదక్): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నారం జనర్దాన్ (45) తనకున్న పొలంలో వరి పంట సాగుస్తున్నాడు. అడవి పందుల నుంచి రక్షణ కోసం పొలానికి చుట్టూ వైరును ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. ఉదయం పొలానికి వెళ్లిన జనార్దన్‌కు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట పంపినట్లు పోలీసులు తెలిపారు.

కాళేశ్వరం కాల్వలో పడి రైతు మృతి



రవి నాయక్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు కాళేశ్వరం కాలువలో పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన నర్సాపూర్ మండలం కాజీపేట పంచాయతీ పరిధిలోని రాంసింగ్ తండాలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాట్రోత్ రవి నాయక్ (38) బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం పొలం వద్దకు వెళ్లాడు. పొలం కాళేశ్వరం కాలువకు ఆనుకొని ఉండడంతో ప్రమాదవశాత్తు అందులో కాలుజారి పడి మృతిచెందాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం దక్కలేదు. ఉదయం మరోసారి వెతుకుతుండగా.. కాలువలో నీటిపై తేలియా డుతూ కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళలకు అండగా షీ టీమ్

సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్వేత

గజ్వేల్‌రూరల్: బాలికలు, మహిళలకు అండగా షీ టీం పనిచేస్తుందని, విద్యార్థులు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత చెప్పారు. ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో గురువారం ఆమె విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, షీ టీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, మహిళల రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేధింపులకు గురైతే వెంటనే షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సమస్యలు తలెత్తినపుడు 100, 112, 1098తో పాటు షీ టీమ్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ 8712667435 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ రమేష్, సెయింట్ మేరీస్ విద్యానికేతన్ కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, షీ టీమ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ...

పటాన్‌చెరు టౌన్: మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన బికాస్ నాయక్(38) రుద్రారంలో ఉంటూ, ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బికాస్ భార్య గర్భవతి కావడంతో ఆరు నెలల క్రితం ఒడిశాకు వెళ్లింది. అప్పటి నుంచి బికాస్ ఒంటరిగానే ఉంటున్నాడు. రెండు రోజుల నుంచి ఆయన భార్య బికాస్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో వరుసకు సోదరుడైన ప్రకాశ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో ఆయన ఇంటికి వెళ్లి చూడగా బికాస్ ఫ్యాన్‌కు శాలువాతో ఉరివేసుకుని ఉండడం గమనించి సమాచారం ఇచ్చాడు. గురువారం బికాస్ సోదరుడు ప్రకాశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బతుకే ఉత్సవం.. బతుకమ్మ సంబురం

- 14 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 22న సద్దుల బతుకమ్మతో ముగింపు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ.. అంటూ బతుకమ్మ పండుగ సంబరాలు ఉత్సాహంగా ఆరంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడపడుచులు వైభవంగా జరుపుకుంటారు. ఎంగిలి మెతుకులతో మొదలై సద్దుల బతుకమ్మతో పండుగ ముగుస్తుంది. ఈ నెల 14 నుంచి ప్రారంభమై, 22న సద్దుల బతుకమ్మతో ఉత్సాహంగా ముగిస్తారు. బతుకమ్మకు మంత్రాలుండవు.. కలిసి పాడుకునే పాటే మంత్రం, బతుకమ్మకు గుడులుండవు.. నలుగురూ గుమిగూడిన చోటే గుడి, నాలుగు చేతులు కలిస్తే ఆట, జన జీవన సౌందర్యమే బతుకమ్మ. వెరసి కలిసి బతుకమనే పండుగే బతుకమ్మ పండుగ. బతుకే ఇక ఉత్సవం అని బోధించే పండుగ ప్రపంచంలో బహుశా ఇదొక్కటే కావచ్చు.

తొమ్మిది రోజులు..
తొమ్మిది రకాల నైవేద్యాలు

బతుకమ్మకు తొమ్మిది రోజులు తొమ్మిది రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. రోజుకొక్క తీరుగా గౌరమ్మను కొలుస్తారు. మొదటి రోజు మహాలయ అమావాస్య రోజు బతుకమ్మ వేడుక ప్రారంభం అవుతుంది. ఎంగిలిపువ్వు బతుకమ్మగా కొలిచి నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు. రెండోరోజు అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మగా కొలుస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మగా కొలిచి ముద్దపప్పు, బెల్లం, పాలుతో కలిపి నైవేద్యం తయారుచేసి సమర్పిస్తారు. నాలుగో రోజు నానే బియ్యం బతుకమ్మ అని నానేసిన బియ్యం పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు. ఐదో రోజు అట్ల బతుకమ్మగా కొలిచి అట్లు లేదా దోశలు నైవేద్యంగా సమర్పిస్తారు. ఆరో రోజు అలిగిన బతుకమ్మ అంటూ నైవేద్యమేమీ సమర్పించరు. ఏడో రోజు కొలిచేది వేపకాయల బతుకమ్మ.. బియ్యం పిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా పెడుతారు. ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మగా కొలిచి నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా కొలిచి ఆశ్వయుజ అష్టమి నాడు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదు రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ, కొబ్బరన్నం, నువ్వులన్నం, తొమ్మిది రోజుల సమర్పించే నైవేద్యాలతో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు.

బతుకమ్మ చరిత్ర

బతుకమ్మకు ఎంతో చరిత్ర ఉంది. దక్షిణ భారతదేశాన్ని పాలించిన చోళ చక్రవర్తి ధర్మాంగదుడు సంతానం కోసం చాలా పూజలు, వ్రతాలు చేయగా ఆయనకు లక్ష్మీదేవి అనుగ్రహంతో ఒక కూతురు పుట్టింది. ఆ పసిబిడ్డ అనేక గండాలను గట్టెక్కి బతికినందుకు ఆమె తల్లిందండ్రులు బతుకమ్మా అని పేరు పెట్టారు. అప్పటి నుంచి యువతులు మంచి భర్తను ప్రసాదించాలని కోరుతూ బతుకమ్మను కొలువడం ఆనవాయితీగా మారిందని చెబుతారు.

జనగామ సభకు భారీగా జనసమీకరణ

ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా

చేర్యాల(సిద్దిపేట): 16న జనగామలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు భారీగా జనాన్ని తరలించి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జనగామ నియోజకవర్గ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణ కేంద్రంలోని రెండు ఫంక్షన్ హాళ్లలో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో ఆయన మట్లాడుతూ 16న నిర్వహించే సభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నారని, మున్సిపాలిటీలు, మండలాల నుంచి సుమారు లక్ష మందిని తరలించి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మరో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఉల్లెంగుల ఏకానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగరాలి



కొండాపూర్ నేతలతో మంత్రులు హరీశ్, కేటీఆర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, మల్కాపూర్ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్ గురువారం హైదరాబాద్‌లో మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ లను కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు వారితో మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌పార్టీ గెలుపు కోసం కృషిచేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, ఎప్పటిలాగానే ఉద్యమస్ఫూర్తిని చూపించి పార్టీ గెలుపు కృషి చేయాలని సూచించారు. సంగారెడ్డిలో జరిగిన అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ వల్లే జరిగిందన్నారు. కాబట్టి సంగారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలని సూచించారు. శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తాము పూర్తిగా కష్టపడి పార్టీ గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. ఉద్యమం నుంచి పార్టీతో నడిచామని ఇకపై కూడా కొనసాగుతామని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

అడిషనల్ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొట్టిన అడిషనల్ కలెక్టర్ వాహనం

కొండపాక(గజ్వేల్): పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్‌కు తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం.. అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్ హైదరాబాద్ నుంచి రామగుండం వైపునకు ప్రభుత్వ వాహనంలో బయలుదేరారు. వారి వాహనానికి ముందు వెళ్తున్న ఒక కారు రాజీవ్ రహదారిపై ఉన్న చిన్నికిష్టాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా తిరిగింది. దీంతో అడిషనల్ కలెక్టర్ వాహన డ్రైవర్ దానిని తప్పించబోయి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది.

మోటారు పంపు చోరీ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ వ్యవసాయ బావి వద్ద మోటరు పంపును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు ఇల్లందుల రమేష్ వ్యవసాయ బావి వద్ద నుంచి మోటారు పంపును దొంగలు అపహరించారు. వాటి విలువ సుమారు రూ. 60 వేల వరకు ఉంటుందని, రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

175 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న 175 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. బొల్లారం నుంచి నాందేడ్ ప్రాంతానికి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అందోల్ మండల పరిధిలోని సంగుపేట గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా ఒక లారీలో అక్రమంగా తరలిస్తున్న 380 సంచుల రేషన్ బియ్యం పట్టుకున్నామని చెప్పారు. వాటి విలువ సుమారు రూ. 2.1 లక్షల వరకు ఉంటుందని, డ్రైవర్ రియాజ్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని లారీ యజమాని సయ్యద్ హాఖీమ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

కొల్చారం(నర్సాపూర్): పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన నెల్లి జయమ్మ(42) తెల్లవారు జామున కాలకృత్యాలకు వెళ్లి వస్తుండగా పాముకాటుకు గురైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో జయమ్మ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం

కామారెడ్డి క్రైం: కారు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి బల్దియా పరిధిలోని టేక్రియాల్ బైపాస్ సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. కొండపాక మండలం సిరిపినగండ్లకు చెందిన బాబు(55) సెంట్రింగ్ పనుల నిమిత్తం కామారెడ్డికి వచ్చాడు. గురువారం టేక్రియాల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా కారు వెనక నుంచి ఢీ కొట్టింది. ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. బాబు తమ్ముడి కుమారుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని దేవునిపల్లి ఎస్‌ఐ రాజు తెలిపారు.

నేడు అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్

సిద్దిపేటజోన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు స్థానిక స్టేడియం గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ సెలక్షన్ ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి వెంకట్ స్వామి పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేరు వేరుగా 400మీ, 800మీ,1500మీ, 2000మీ పరుగు, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పూట్, డిస్కస్ త్రో, అంశాల్లో సెలక్షన్స్ ట్రయల్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ చూపించిన వారు ఈనెల 26, 27 తేదీలలో సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పదవ తరగతి మెమో లేదా తహసీల్దార్ ద్వారా పొందిన పుట్టిన ధ్రువ పత్రం తీసుకొని రావాలని సూచించారు.. మరిన్ని వివరాలకు 9704661898, 9704061543 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాతకక్షలతో దాడులు

ఒకరికి తీవ్రగాయాలు

ఝరాసంగం(జహీరాబాద్): పాత కక్షలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు చెందిన వారు బండి శంకర్, బండి జనార్దన్ గురువారం రాత్రి గొడ్డలి, ఇనుప రాడ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో బండి జనార్దన్‌కు స్వల్ప గాయాలు కాగా బండి శంకర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. గతంలో గొడవపడి కేసులు పెట్టుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎస్ఎన్ఐసీకి ఎన్‌సీసీ కెడెట్లు



ఎస్ఎన్ఐసీకి చేరుకున్న కెడెట్లు

గజ్వేల్‌రూరల్: స్థానిక బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రారంభమైన ఎస్ఎన్ఐసీ (స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు)నకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కాడెట్లు చేరుకున్నట్లు కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాడెట్ల వివరాలను సేకరించారు. అనంతరం క్యాంప్ డిప్యూటీ కమాండర్ కల్నల్ పీఎస్ నందాతో కలిసి ఆయన మాట్లాడారు. జమ్ము అండ్ కాశ్మీర్, లడక్, బిహార్, జార్ఖండ్, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అండమాన్-నికోబార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా వంటి రాష్ట్రాల నుంచి సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్‌నకు చెందిన కాడెట్లతో పాటు ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు ఎన్‌సీసీ అధికారులు వచ్చారన్నారు. వారికి వివిధ అంశాలపై ఈనెల 23 వరకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి బెటాలియన్ సుబేదార్ మేజర్ సురేందర్ గురుంగ్, సుబేదార్ శివశంకర్, లెఫ్టినెంట్ భవాని తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌కు గజ్వేల్ ప్రచార బాధ్యతలు

7 నియోజకవర్గాలకు బీఆర్ఎస్ ప్రచార ఇన్‌చార్జీల నియామకం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలోని నియోజకవర్గాలకు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార ఇన్‌చార్జీలను నియమించింది. గజ్వేల్ నియోజకవర్గ ఎన్నికల ప్రచార బాధ్యతలను మంత్రి హరీశ్‌రావుకు అప్పగించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డిలు కూడా గజ్వేల్‌కు ఇన్‌చార్జీలుగా వ్యవహరించనున్నారు. దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జీగా టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లు, మెదక్‌కు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డి, ఆందోల్‌కు మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, జహీరాబాద్‌కు బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, సంగారెడ్డికి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ భూపాల్ రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇన్‌చార్జీలుగా వ్యవహరించనున్నారు. పటాన్ చెరు, నారాయణఖేడ్, సిద్దిపేటలకు ఇంకా నియమించలేదు.

సైబర్ వలలో మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- టాస్కులు, కమీషన్‌ల పేరుతో మోసం
- రూ.30 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.30 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 23న పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో అతను ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.30 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. తాను పెట్టిన నగదు, కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు.. అమీన్ పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు


పటాన్‌చెరు టౌన్: బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువకుడికి గాయాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం... నిజాంపేట్ మండలం కిరియా నాయక్ తండాకు చెందిన గురునాథ్(24) రెండు రోజుల క్రితం పటాన్‌చెరు జేపీ కాలనీలోని తన స్నేహితుడు కడావత్ సురేశ్ వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి వారు సురేశ్ బైక్‌పై టీ తాగేందుకు ముత్తంగి ఓఆర్ఆర్ సమీపంలో హోటల్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా గ్రామీణ బ్యాంక్ సమీపంలో యూటర్న్ తీసుకునే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో వెనకాల కూర్చున్న గురునాథ్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సురేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురునాథ్ తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ లక్ష్మయ్య కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ప్రవీణ్(27) పాశమైలారం వలస వచ్చి, ఒక ప్రైవే ట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. 8న నైట్‌షిఫ్ట్ విధు లకు హాజరయ్యాడు.తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తన విధుల్లో భాగంగా బ్రాయిలర్ డోర్ ఓపెన్ చేశాడు. ఒక్కసారిగా మంటలతో పాటు, ఆవిరి రావడంతో ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం లింగంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, అక్కడ నుంచి గాంధీ ఆసుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వికటించిన వైద్యం

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన



సదాశివపేట పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రి వద్ద అందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు

సదాశివపేట (సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో గర్భసంచికి చెందిన సమస్యతో ఈ నెల10న చికిత్స కోసం కొండాపూర్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన మల్లమ్మ(41) చేరింది. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి బుధవారం సాయంత్రం సిజేరియన్ ఆపరేషన్ చేశారు. కానీ బ్లీడింగ్ ఆగకపోవడంతో వారు తిరిగి పరీక్షలు నిర్వహించి మళ్లీ సిజేరియన్ చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో వైద్యుల సూచనల మేరకు బుధవారం రాత్రి 10 ఆమెను హైదరాబాద్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లమ్మ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆపరేషన్ సరిగా చేయకపోవడం వల్లే ఆమె చనిపోయిందని అక్కడి వైద్యులు చెప్పారు. దీంతో ఆగ్రహించిన మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు సదాశివపేటలోని ప్రైవేటు ఆసుపత్రి వద్ద మృత దేహంతో వచ్చి ఆందోళన చేయడానికి సిద్ధపడ్డారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి సదాశివపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబులెన్స్‌ను అడ్డుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మల్లమ్మ మరణించిందని, తమకు న్యాయం చేయాలని అలాగే ఆసుపత్రి గుర్తింపును రద్దు చేసి వైద్యులపై చర్య లు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

వైద్యుల సమక్షంలో ఆపరేషన్ :
ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్

గర్భసంచి సమస్యతో ఆసుపత్రిలో చేరిన మల్లమ్మకు సీనియర్ వైద్యుల సమక్షంలోనే ఆపరేషన్ చేశామని, తమ నిర్లక్ష్యం ఏమీలేదని ఆసుపత్రి వైద్యుడు చంద్రశేఖర్ తెలిపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆసుపత్రికి పంపించామని చెప్పారు. కాగా, మల్లమ్మ తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు ఆసుపత్రి యజమాన్యంపై కేసు నమోదు చేశామని సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

పట్టాలిచ్చి.. ఎలా లాక్కుంటారు

- మున్సిపల్ సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలి
- బాధితులకు సీపీఎం నేతల పరామర్శ



కూల్చివేసిన ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: ఇందిరమ్మ పథకం కింద పట్టాలిచ్చిన భూములను ఎలా లాక్కుంటారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం హమాలీ కాలనీలో ఇటీవల మున్సిపల్ అధికారులు కూల్చివేసిన గుడిసెలను పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ పథకంలో స్థలాల పట్టాలు ఇచ్చారని, మున్సిపల్ అధికారులు రియల్ వ్యాపారులతో కుమ్మక్కై పేదల స్థలాలను లాక్కుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా కూల్చివేసిన గుడిసెలకు పరిహారం ఇవ్వడంతోపాటు, అందుకు కారణమైన మున్సిపల్ సర్వేయర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పేదల గుడుసెలను ఎలా కూల్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మల్లేశం, బసవరాజు, జిల్లా కమిటీ సభ్యులు గీత, నాయకులు లచ్చాగౌడ్, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.